సమస్యలు తీరిస్తేనే.. ఓటేస్తాం

- ఎన్నికల బహిష్కరణ దిశగా లోతొర్రె గ్రామస్తులు
- వాగుపై వంతెన, గ్రామానికి రోడ్డు కోసం డిమాండ్

జన్నారం: మండలంలో లోతొర్రె అనే మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామం. ఇటీవల తాండాలను గ్రామ పంచాయతీలుగా మార్చే క్రమంలో లోతొర్రె ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఇక్కడ జనాభా 350ఉండగా, 235మంది ఓటర్లున్నారు. 40సంవత్సరాల క్రితం ఈ గ్రామం ఏర్పడింది. పోడు భూములకు పట్టాలు పొంది వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే కవ్వాల్ రాం తాండా మీదుగా, సోనాపూర్ తాండా తర్వాత వాగు దాటి వెళ్లాల్సి ఉంటుంది. కవ్వాల్ నుంచి 3.5 కి.మీ దూరం ఉంటుంది. ఇటీవలి వర్షాకాలంలో అధికవర్షాలు పడి పది రోజులు రాకపోకలు నిలిచాయి. దీంతో కొన్ని సంవత్సరాల కాలంగా వాగుపై వంతెన నిర్మించాలని, రోడ్డు వేయాలని వచ్చిపోయే నాయకులను, అధికారులను వేడుకుంటున్నారు. అయినా ఆ సమస్య సంవత్సరాల కాలంగా సమస్యగానే మారింది.

ఎన్నికల బహిష్కరణ వైపు..

ఏటా ఎన్నికల సమయంలో వివిధ పార్టీల నాయకులు రావడం, హామీలు ఇవ్వడం, ఓట్లు అయిపోగానే మరిచిపోతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే వచ్చే ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికే గ్రామంలో తీర్మానం చేసుకున్నట్లు చెబుతున్నారు. అధికారులు గానీ, నాయకులు గానీ వాగుపై వంతెన, రోడ్డు కోసం హామీ ఇస్తేనే ఎన్నికల్లో పాల్గొని ఓట్లు వేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



ఇటీవల వర్షాకాలంలో వాగు ఉప్పొంగడంతో ఇబ్బందిపడుతూ దాటుతున్న గ్రామస్తులు

రోడ్డుకు అనుమతి ఎందుకివ్వరూ..



40 సంవత్సరాల నుంచి ఇదే గ్రామంలో బతుకుతున్నం. కరెంట్ ఇచ్చారు. ఇళ్లను ఇచ్చారు. నీళ్లను ఇచ్చారు. మా ఊరికి వెళ్లేందుకు రోడ్డు ఇవ్వడానికి ఎందుకు అడ్డు చెబుతున్నారు. రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతి ఇస్తలేరని పని చేయలేదు. ఈ విషయంలో అధికారులు, నాయకులు చొరవ తీసుకుంటేనే ఓట్లు వేస్తాం.

\- కుర్సింగ గంగారాం, గ్రామ పెద్ద

సమస్యల పరిష్కారం కోసమే తీర్మానం



కాలం మారుతున్నా, పాలకులు మారుతు న్నా మా బతుకులు మారడం లేదు. సెల్‌ఫోన్‌లతో ప్రపంచమే అరచేతిలోఉన్నా, మాకు నేటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడం బాధగా ఉంది. సమస్యల పరిష్కారం కోసం ఎన్నికలను బహిష్కరించాలని తీర్మానం చేసుకున్నాం. హామీ ఇస్తే ఓట్లు వేస్తాం.

\- కుర్సింగ జుగాదిరావ్, లోతొర్రె

రోడ్డు మంజూరైనా.. చేపట్టని పనులు

2020లో లోతొర్రె గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైంది. కొత్తూరుపల్లి, లక్ష్మీపూర్ తాండా, మన్నెగూడ వయా లోతొర్రె వరకు 3.475 కి.మీ బీటీ రోడ్డు మంజూరు కాగా రూ.203.94 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ రోడ్డు 2022వరకు పూర్తి చేయాల్సి ఉంది. కానీ కొత్తూరుపల్లి, లక్ష్మీపూర్ వరకు రోడ్డు పూర్తి చేసి నిలిపివేశారు. గ్రామం అటవీ సమీపంలో ఉన్నందునా అటవీశాఖ అనుమతులు ఇవ్వలేదని కాంట్రాక్టర్ చెబుతున్నప్పటికీ, అప్పటి నుంచి రోడ్డు గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

కాంగ్రెస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి

- మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్/శ్రీరాంపూర్/దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని, మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన వివిధ వార్డు బీఆర్‌ఎస్ నాయకులు, కుల సంఘాల నాయకులు పీఎస్సార్ నాయకత్వాన్ని బలపరుస్తూ బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సినీ కార్మిక సంఘం అధ్యక్షుడు పొలసాని సత్యనారాయణరావు, బీఆర్‌ఎస్ నాయకులు నడిపెల్లి శ్రీనివాస్, పద్మశాలీ సంఘం జిల్లా కోశాధికారి నల్ల దేవేందర్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మట్టెల రమేశ్, ప్రధాన కార్యదర్శి కోటోజు రమేశ్, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆకుల మహేశ్‌తో పాటు, పలువురికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. అనంతరం తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా నాయకులు పీఎస్సార్‌కు పూర్తి మద్దతును ప్రకటించి, ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ కార్మికవాడలో 5, 16, 17వ వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్‌కు ఓటేయ్యాలని కోరారు. అనంతరం ఆర్కే 8 కాలనీలోని డిస్పెన్సరీ వద్ద నిర్వహించిన సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తనను గెలిపిస్తే శ్రీరాంపూర్‌లో సింగరేణి స్థలాల్లో ఇళ్ల పట్టాలు రాని వారికి పట్టాలిప్పిస్తానన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సుర్మిళ్ల వేణు, కౌన్సిలర్ తెలుగు లావణ్య దేవేందర్, నాయకులు పాల్గొన్నారు. దండేపల్లిలో వెల్గనూర్ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, విశ్రాంత ఎంఈవో సత్తయ్యతో పాటు మల్లేష్, మొండయ్య, నానయ్యతో పాటు రెబ్బనపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. హాజీపూర్ మండలం దొనబండలో ప్రచారం అనంతరం రాత్రి ఏర్పాటు చేసిన ఆశీర్వాద సభకు హాజరయ్యారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు.



దొనబండలో అభివాదం చేస్తున్న ప్రేంసాగర్‌రావు



పార్టీలో చేరిన వారితో ప్రేంసాగర్‌రావు

ఉద్యోగాలు ఇప్పించింది కేసీఆరే

- మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను ఇప్పించింది కేసీఆరేనని మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు తెలిపారు. ఆర్కే 5గని పై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. నాడు జాతీయ సంఘాలు వారసత్వ ఉద్యోగాలను పోగొడితే, కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన మాట మేరకు తిరిగి పునరుద్ధరించారన్నారు. దీంతో సింగరేణి నేడు యువ కార్మికులతో కలకలలాడుతుందన్నారు. సింగరేణి మరింత అభివృద్ధి చెందాలన్నా, కార్మికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నా బీఆర్‌ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో తనను ఆదరించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సింగరేణితో పాటు ఈ ప్రాంత నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, పెట్టం లక్ష్మణ్, తొంగల రమేష్, రౌతు సత్యనారాయణ, నెల్కి మల్లేష్, శ్రీనివాస్ రావు, మహేందర్ రెడ్డి, నీలం సదయ్య, అన్వేష్ రెడ్డి, ప్రవీణ్, పానుగంటి సత్తయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

'కారు' గుర్తుకు ఓటెయ్యాలే...

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/నస్పూర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో,హాజీపూర్ మండలం పడ్తనపల్లి-కర్ణమామిడి గ్రామాల్లో, నస్పూర్ పట్టణ పరిధిలోని రెండో వార్డు ప్రశాంత్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి, బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ నెల 30వ తేదీ జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న దివాకర్ రావు



పాతమంచిర్యాలలో ఎన్నికల ప్రచారంలో...

బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలి

- బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య

తాండూర్: బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య తాండూర్ మండలంలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని చౌటపల్లి, పోచంపల్లి, బోయపల్లి, అంకుశం, బోయపల్లి బోర్డు, మాదారం త్రీ ఇంక్‌లైన్, నర్సాపూర్, బెజ్జాల, అబ్బాపూర్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని స్థానికులకు వివరించారు. అభివృద్ధికి కేరాఫ్‌గా బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, స్థానిక నాయకులు దుగుట శ్రీనివాస్, బోడ సతీష్, మహీధర్ గౌడ్, రాజేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బీఆర్‌ఎస్‌ను ఆదరించండి

బెల్లంపల్లిరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ప్రజలు ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని అంకుశం గ్రామంలో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల దగ్గర ఓట్లను అభ్యర్థించారు. అనంతరం చిన్నయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ రాజమొగిళి, మాజీ ఎంపీపీ సుభాష్‌రావు, నాయకులు కృష్ణ, గణేష్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలన పోవాలంటే బీజేపీకి ఓటేయండి

- చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్

భీమారం: చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి అని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ అన్నారు. మండలంలోని మద్దికంటి, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రజలు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తుందని, పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కొత్త రేషన్ కార్డులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను తాము ఇస్తున్నట్లుగా కేసీఆర్ ప్రకటించుకున్నట్లు ఆరోపించారు. కుటుంబ పాలన పోవాలంటే బీజేపీ పార్టీకి ఓటు వేసి గెలపించాలని కోరారు. ఆయన వెంట మండల నాయకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మద్దికల్ ప్రచారంలో దుర్గం అశోక్

'పథకాలు వివరిస్తూ ప్రజల్లోకి వెళ్తాం'

మందమర్రిరూరల్: కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందని, వాటిని వివరిస్తూ ప్రజల్లోకి వెళ్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు సొత్కు సంజీవరావు తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు స్వార్థంతో పార్టీని వీడి పోయినంత మాత్రానా, బీజేపీకి ఎలాంటి నష్టం లేదన్నారు. ప్రజల్లో బీజేపీపై అభిమానం ఉందని, తప్పకుండా ఆదరిస్తారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఆరుముల్ల పోషం, డీవీ దీక్షితులు, రాంటెంకి దుర్గరాజ్, మల్యాల రాయమల్లు, రమేష్, మార్త కుమారస్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీర్సా ముండా ఆశయసాధనకు కృషిచేయాలి

కాసిపేట: ఆదివాసీల ఆరాధ్య దైవం బీర్సా ముండా ఆశయసాధనకు ఆదివాసీలు పూర్తిస్థాయిలో కృషి చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. మండలంలోని కొండాపూర్‌లో ఆదివాసీ సేన ఆధ్వర్యంలో బుధవారం 148వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడావి వెంకటేష్, మడావి గంగారాం, పెందూర్ శంకర్, సిడాం గణపతి, పెందూర్ ప్రభాకర్, ఆత్రం సంజీవ్, రాము తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

ప్రారంభించారు.. నిర్వహణ మరిచారు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో గత కొన్నేళ్లుగా జీసీసీ భవనం నిరుపయోగంగా ఉండేది. భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు రూ.4.5లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారు. వాటితో భవనానికి మరమ్మతు చేయించారు. దాంట్లో గ్రంథాలయం ఏర్పాటు చేసి జూన్ 20న ప్రారంభించారు. కానీ నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో, ప్రస్తుతం గ్రంథాలయం తెరుచుకోక నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



తెరుచుకోని తాళ్లపేట గ్రంథాలయం

క్లుప్తంగా

ఘనంగా కాళీమాత నిమజ్జన యాత్ర



రామకృష్ణాపూర్: పాకిస్తాన్ క్యాంప్ కాళీనగర్‌లో బుధవారం కాళీమాత నిమజ్జన యాత్రను ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ఏటా నిర్వహించే ప్రత్యేక పూజల్లో భాగంగా బెంగాలీలు మూడు రోజులపాటు కాళీమాతకి పూజలు నిర్వహించారు. కాళీమాతకు శుక్రవారం మహిళలు హారతులిచ్చి మంచిర్యాలలోని గోదావరిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలని వినతి

చెన్నూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఏబీవీపీ సభ్యులు దివ్య, దీప్తి, వినయ్, వసుధ పాల్గొన్నారు.

బుంగతో బెంగ..!



భీమిని: కన్నెపల్లి మండలంలోని ముత్తాపూర్ నుంచి ఆనందాపూర్‌కు వెళ్లే దారిపై బుంగ ఏర్పడటంతో ప్రయాణికులు ఎప్పుడు, ఏం ప్రమాదం జరుగుతోందని భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణికులు కిందపడిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బుంగను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటు స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి



దేవాపూర్‌లో పాల్గొన్న సీఐ, పోలీసులు



ఇందారంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కాసిపేట: ఓటుహక్కును ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని దేవాపూర్‌లో పోలీస్ సిబ్బందితో బుధవారం ఆటోస్టాండ్ నుంచి శ్రామికనగర్, ప్రసన్నంజనేయ నగర్, ఓల్డ్ అంగడిబజార్, గోల్లవాడ, రాంపూర్‌లలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నిర్భయంగా ఓటు వేయాలని, భరోసా కల్పించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాపూర్, కాసిపేట ఎస్సైలు ఆంజనేయులు, గంగారాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని ఇందారంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భరోసా కల్పించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఇందారం బస్టాండ్ నుంచి హైస్కూల్ వరకు ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. అనంతరం శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు మాట్లాడారు. ప్రజలకు నమ్మకం కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జైపూర్, శ్రీరాంపూర్, భీమారం ఎస్సైలు ఉపేందర్‌రావు, రాజేశ్, రాజవర్ధన్, మంచిర్యాల ఎన్‌సీసీ అధికారి రాజానందం, పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యదర్శులు, బీఎల్వోలతో సమావేశం

కాసిపేట: పోలింగ్ స్టేషన్లలో కనీస సౌకర్యాలు కల్పించేల చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎంఏ అలీం, తహసీల్దార్ భోజన్న తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఓటరు స్లిప్‌లు అందించడంలో జాప్యం చేయకుండా, అప్రమత్తంగా ఉంటూ సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీవో నాగరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

వరిలో పంటకోత ప్రయోగం

నెన్నెల: మండలంలోని కోనంపేటలో వరి పంట పొలాల్లో బుధవారం వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రేమ్‌కుమార్, ఏఈఓ రాంచందర్ మాట్లాడుతూ.. పంట కోసే ముందు ఐదు మీటర్ల పొడవు, 5మీటర్ల వెడల్పు తీసుకున్నామన్నారు. అందులో వచ్చిన ధాన్యం దిగుబడిని లెక్కకట్టామని చెప్పారు. తద్వారా వచ్చిన దిగుబడి ఆధారంగా పంట మొత్తం దిగుబడి ఎన్ని బస్తాలు వస్తున్నాయో తెలుసుకోవచ్చన్నారు. పంటకోత ప్రయోగం ఎలా చేయాలో వారు వివరించారు. వరి సరాసరి దిగుబడి నిర్ధారణకు ప్రభుత్వం ఏటా ఈ ప్రయోగాలు చేస్తుందన్నారు. వరిపంట నష్టపరిహారాలు చెల్లింపునకు, పంట దిగుబడులను పసిగట్టేందుకు ఈ ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ దిగుబడి అంచనాను జిల్లా గణంకాల అధికారికి పంపించనున్నట్లు చెప్పారు.



ప్రయోగం చేపడుతున్న వ్యవసాయ సిబ్బంది

బీఆర్‌ఎస్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

- ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని 7, 8 వార్డుల పరిధిలో పలువురు ముస్లింలు మాజీ ఎంపీటీసీ జమీల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తనపై కొందరు చేస్తున్న దుష్ప్రచారం నమ్మవద్దని ప్రజలను కోరారు. ఖానాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే షాదీ ముబారక్‌తోపాటు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, మైనార్టీలకు రుణాలు అందించారన్నారు. రాజేందర్, ఖలీల్, రాముసాయక్, సురేశ్, రాజన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఖానాపూర్: నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ గెలిపించాలని ఆ పార్టీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్, దుబ్బగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం సమావేశం నిర్వహించి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. షేక్ సుఫీయన్, డోంగ్రే గణేశ్, పద్వాల్ గోపాల్‌సింగ్, మెస్రం తుకారం, కోవ రాజేశ్వర్, కనక హన్మంత్‌రావు పాల్గొన్నారు.

బజ్జీలు అమ్మిన జెడ్పీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ ఉట్నూర్ పట్టణంలో ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ని గెలిపించాలని ప్రజలను కోరారు. దుకాణంలో బజ్జీలు వేశారు. ధరణి రాజేశ్, వాసు పాల్గొన్నారు.